క్లుప్తంగా

ఎస్పీని కలిసిన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్



ములుగు రూరల్ : ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్‌ను మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్ రేగ కళ్యాణి మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఎస్పీకి మొక్కను అందించారు. అనంతరం కలెక్టర్ దివాకర, డీఎస్పీ రవీందర్‌ను కలిశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సారంగం, డైరెక్టర్లు రసపుల్ సీతారాం నాయక్, బాలయ్య, వెంకన్న, రామస్వామి, పగడయ్య, సమ్మయ్య, వెంకన్న, దేవ్‌సింగ్, రాజ్‌కుమార్, ప్రమీల, గోవిందరావుపేట పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు



వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలోని మురుగు కాల్వలను పంచాయతీ సిబ్బంది చేత శుభ్ర పరిచి పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి చందూలాల్ తెలిపారు. వర్షాకాలంలో నీరు నిలిచి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున కాల్వలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. గుంతలు ఉన్న రోడ్లపై గ్రావెల్ పోయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కారోబార్ ఇంజమూరి వెంకటరమణ, మెట్టు భిక్షపతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఏటూరునాగారం : మండలంలోని గోగుపల్లి గ్రామానికి చెందిన బండారి రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా తెలంగాణ మాల మహానాడు సంఘం నాయకుడు కాళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. నగదుతోపాటు బియ్యం, నిత్యావసరాలు కూడా ఇచ్చామని రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదరి చంద్రమౌళి, రాంబాబు, పెంచికల లక్ష్మీనారాయణ, మాదరి రాజు, అశోక్, బత్తుల సుమన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ములుగు రూరల్ : మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన కల్వాల పోశయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని జెడ్పీ మాజీ చైర్ పర్సన్, బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి పరామర్శించారు. మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు రాసమల్ల సురేందర్, వేములపల్లి భిక్షపతి, గండి కుమార్, రాజయ్య తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



కృష్ణంరాజు(ఫైల్)

ఏటూరునాగారం : మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శంకరాజుపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. శంకరాజు పల్లికి చెందిన తాటికొండ కృష్ణంరాజు (35) మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. అతిగా మద్యం తాగుతుండగా భార్య ఆదిలక్ష్మి భర్త కృష్ణంరాజును మందలించింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నియామకం

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వీరగంటి సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా చిటికేసి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొమురమ్మ, కార్యదర్శిగా చేకూర్తి రాజబాబు, కోశాధికారిగా చింతకుంట నాగమణి, ప్రచార కార్యదర్శిగా చిటికేసి చంద్రమోహన్‌ను జిల్లా అధ్యక్షుడు వంశీగౌడ్ నియమించారు.

వామ్మో.. వానరాలు



రామప్పకు వెళ్లే రోడ్డుపై వానరాల గుంపు



మండల కేంద్రంలో సంచరిస్తున్న కోతులు

- గ్రామాల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులు
- ఇళ్లు, దుకాణాలపై దాడులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

వెంకటాపురం(ఎం) : అడవిలో ఉండాల్సిన వానరాలు జనారణ్యంలో సంచరిస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రేకుల ఇళ్లు, దుకాణాలపై దాడులు చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయానికి వెళ్లే రహదారితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కోతులు సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. విద్యార్థులు సైతం పాఠశాలకు వెళ్తున్న క్రమంలో కోతులు వెంట పడుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లోని అంతర్గత రహదారులపై సంచరిస్తూ తిండికోసం వాహనదారులను, నడిచి వెళ్తున్న ప్రజలపై దాడులు చేస్తున్నాయి. కిరాణా షాపుల్లో తినుబండారాలు ఎత్తుకొని వెళ్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి నిత్యావసర సరుకులను చిందరవందర చేస్తున్నాయి. పంచాయతీ అధికారులకు చెప్పిన పట్టించుకోకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

కాపలా తప్పనిసరి..

కోతుల బెడద వల్ల ఇంటి వద్ద ఒకరూ తప్పకుండా కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రేకుల ఇళ్లు, పెంకులు ధ్వంసం చేస్తూ ఇంట్లో చొరబడుతున్నాయి. ఇంట్లోని వస్తువులను చిందరవందర చేస్తూ నిత్యావసర సరుకులను పట్టుకొని వెళ్తున్నాయి. తిను బండారాలు, కూరగాయాల దుకాణాల్లో కూరగాయాలు ఎత్తుకెళ్తున్నాయి. పంట పొలాల్లోని నారుమడులను సైతం ధ్వంసం చేస్తున్నాయని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో కోతులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సరుకులు ఎత్తుకెళ్తున్నాయి



కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గుంపులు గుంపులుగా వచ్చి ఇంట్లో చొరబడి నిత్యావసరాలను ఎత్తుకెళ్తున్నాయి. ఇంట్లోకి వచ్చిన కోతులను బయటకు పంపించేందుకు ప్రయత్నిస్తే ఎదురు తిరిగి కరిచేందుకు పైపైకి వస్తున్నాయి. ఎటూ వెళ్లకుండా ఇంటివద్దనే కోతుల కోసం కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

– అక్కపల్లి శోభ, వెంకటాపురం(ఎం)

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



దారి పొడవునా కోతులు ఉంటుండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో కోతులు గుంపులుగా వచ్చి భయాందోళనకు గురిచేస్తున్నాయి. అధికారులు స్పందించి కోతులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలి.

– అడిచర్ల రాజయ్య, ఉపాధ్యాయుడు

బాలుడి వైద్యానికి మంత్రి భరోసా



శ్రీరామ్‌తో వీసీలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని ఊరట్టం గ్రామానికి చెందిన శ్రీరామ్ కిడ్నీ, లివర్ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. శ్రీరామ్ వైద్యానికి లక్షల్లో ఖర్చవుతుండడంతో అతడి తల్లి స్వాతి దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. దాతలు ఆదుకోవాలని వేడుకుంటుంది. ఈ విషయం వాట్సాప్ ద్వారా తెలుసుకున్న రాష్ట్ర మంత్రి సీతక్క శ్రీరామ్ వైద్యానికి అవసరమైన ఖర్చును వ్యక్తిగతంగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. శ్రీరామ్ ఇప్పటికే ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా సీతక్క పీఏ సంతోష్ శ్రీరామ్‌ను మరిన్ని వైద్య పరీక్షల కోసం హనుమకొండలోని గ్రావిడ్ హోమ్ పిల్లల ఆస్పత్రి డాక్టర్ ప్రదీప్ వద్దకు తీసుకు వెళ్లి పరీక్షలు చేయించారు. వైద్యులు శ్రీరామ్‌కి పిత్తాశయంలో మూడు రాళ్లు, సికెల్ సెల్ ఎనీమియా (రెండు, మూడు నెలలకు ఒకసారి రక్తం తగ్గిపోవడం) అనే అరుదైన వ్యాధి ఉందని గుర్తించారు. ఈ నేపథ్యంలో వైద్యుడితో మంత్రి సీతక్క వీడియో కాల్ మాట్లాడి శ్రీరామ్ వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. శ్రీరామ్‌కు అవసరమైన మెరుగైన వైద్యం హైదరాబాద్‌లో అందిస్తామని హామీ ఇచ్చారు. తనతో పాటు సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటూ అవసరమైన సాయం అందిస్తానని భరోసానిచ్చారు. శ్రీరామ్‌తో సైతం మంత్రి సీతక్క వీడియో కాల్‌లో మాట్లాడారు. నేను ఉన్నా.. నువ్వు కోలుకుంటావు, బాగా చదువుకోవాలి, మీ ఇల్లు ఎక్కడ, అమ్మానాన్న ఎవరు అని అడిగి తెలుసుకున్నారు.

నూతన ప్రయోగాలపై దృష్టి సారించాలి



మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఈట నవీన్

ఏటూరునాగారం : డిగ్రీ చదువుతున్న విద్యార్థులు నూతన ప్రయోగాలపై దృష్టి సారించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఈట నవీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు సిలబస్, క్రెడిట్ సిస్టం, గ్రేడింగ్ విధానం, నైపుణ్య, సామర్థ్యపరమైన కోర్సుల వంటి అకడమిక్ సంబంధమైన విషయాలను నవీన్ వివరించారు. విద్యార్థులు కోర్సులకు అనుబంధంగా ప్రవేశపెట్టిన వివిధ నైపుణ్య, సామర్థ్యాలను తప్పనిసరిగా నేర్చుకొని డిగ్రీ స్థాయిలో సంపూర్ణ జ్ఞానంతో బయటకు వెళ్లి ఉన్నత విద్యను పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకటయ్య, ఐక్యూఏసీ కన్వీనర్ జ్యోతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ కనీస్ ఫాతిమా, సంపత్, రమేష్, జీవవేణి, సుమలత, భావన, భాస్కర్, అభిలాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి



కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

ములుగు రూరల్ : పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా, తాడి కార్పొరేషన్ చెక్కులను తక్షణమే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకుడు పులి నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం కలెక్టర్ టీఎస్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..50 సంవత్సరాలు నిండిన కల్లుగీత కార్మికుడికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేస్తామని హామీ ఇచ్చారని ఏడాది గడిచిన అమలు చేయలేదని పేర్కొన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర శ్రీనివాస్, గుండబోయిన రవిగౌడ్, జనార్దన్, స్వప్న, సత్యనారాయణ, అశోక్, నరేందర్, శ్రీధర్, మొగిలి, నర్సయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలివ్వాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి



ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ఏటూరునాగారం : ములుగు మండలంలోని రాయినిగూడెంలో గల సీలింగ్ భూములకు పట్టాలివ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 40ఏళ్ల నుంచి ములుగు మండలం రాయినిగూడెంలోని సర్వేనంబర్ 111, 112లో 30 మంది గిరిజనులు కాస్తు, కబ్జాలో ఉన్నారని వివరించారు. వీరికి గతంలో మూడో విడత భూ పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదుగురికి పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. మిగిలిన 25 మందికి పట్టా రాలేదని తెలిపారు. ఈ భూమిలో అక్రమంగా నాగవెల్లి బాబు కూడా తనకు పట్టా ఉందని దబాయిస్తున్నట్లు తెలిపారు. గతంలో పనిచేసిన ఐటీడీఏ పీఓ అంకిత్ నాగవెల్లి బాబుకు ఈ భూమికి సంబంధం లేదని తీర్పు ఇచ్చారన్నారు. కానీ అతడు ఆ భూమిలోనే సాగు చేస్తున్నాడని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన భూభారతి పేరుతో గ్రామాల్లో సర్వే నిర్వహించి ఈ భూములపై సర్వే చేసి వెంటనే 25 మంది గిరిజనులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అక్రమంగా కాస్తులో ఉన్న నాగవెల్లి బాబును భూమి నుంచి ఖాళీ చేయించాలని పీఓను కోరారు. ఈ కార్యక్రమంలో తవిటి నారాయణ, వట్టం సమ్మయ్య, చెరుకుల రాజన్న, కుర్ర రాజు, ఆగబోయిన పోతయ్య, తవిటి లక్ష్మి, సాంబక్క ,వజ సారక్క, వంక సుగుణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ లోకల్ కోర్టు

మల్హర్/పలిమెల : పలిమెల మండలంలోని సర్వాయిపేట సబ్ స్టేషన్ ఆవరణలో నేడు (మంగళవారం) విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు కాటారం ఏడీఈ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, ఓల్టేజీ హెచ్చు, తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపు, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ తదితర సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు రాత పూర్వకంగా ఈ కోర్టులో ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక చైర్మన్ ఎన్వీ వేణుగోపాలచారితో పాటు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్వీకరణ ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని వెల్లడించారు. మల్హర్ మండల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఉచిత వైద్యశిబిరం

మల్హర్ : మండలంలోని తాడిచర్ల ఎస్టీ హాస్టల్‌లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ వినయ్‌భాస్కర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 36 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే వల్లెకుంట గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక దందా

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

మంగపేట : మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఎలాంటి అనుమతి లేకుండా కొందరు వాగుల నుంచి అక్రమ ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. నిత్యం మండల కేంద్రంలోని గౌరారం, మల్లూరు, రాజుపేట ముసలమ్మ వాగు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పట్టపగలే ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. కొందరు అక్రమ ఇసుక తరలింపును వ్యాపారంగా ఎంచుకుని ట్రాక్టర్లతో తరలిస్తూ ప్రైవేటు కాంట్రాక్టు పనులకు, సిమెంటు ఇటుకల తయారీ కేంద్రాలకు తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికి సంబంధిత రెవెన్యూ అధికారుల పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మంగపేట, కమలాపురం, మల్లూరు, రాజుపేట తదితర గ్రామాల్లోని సిమెంటు ఇటుకలు, దర్వాజాలు, కిటికీలు తదితర సిమెంటు పరికరాలను తయారుచేసి విక్రయించే వ్యాపారులకు బాహాటంగా ఇసుకను విక్రయిస్తున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సంబంధిత ఎంపీడీఓ, తహసీల్దార్ ద్వారా అనుమతి తీసుకుని ఇసుక తీసుకోనే విధంగా అవకాశం కల్పించింది. అయినప్పటికీ లబ్ధిదారులు కాకుండా ఇతర వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణులకు మెరుగైన రవాణా సౌకర్యం

రేగొండ : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని రామన్నగూడెంలో బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు మహాలక్ష్మి పేరిట ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. పరకాల నుంచి ములుగుకు రామన్నగూడెం మీదుగా నడిచే బస్సు సర్వీస్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బస్సును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే బస్సులో ప్రయాణించారు.

హుండీల దొంగ అరెస్ట్



అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం, రామన్నగూడెం శివాలయంలో హుండీలు దొంగతనం చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో దొంగ అరెస్టును చూపి వివరాలు వెల్లడించారు. తాడ్వాయి మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన చేల సందీప్ సాయిబాబా ఆలయంలో హుండీ దొంగతనం చేసి నగదు అపహరించాడు. సీసీ కెమెరాల ద్వారా అతడిని గుర్తించామన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుడగా అటు వైపు నుంచి వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఏటూరునాగారం, రామన్నగూడెం ఆలయాల్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. రూ.1,100ల నగదు స్వాధీనం చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సదానందం, హరిష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వెంకటాపురం(ఎం): బండ్లపహాడ్‌లో నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్లు



వాజేడు: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



వెంకటాపురం(ఎం): నీటిని పారబోస్తున్న సిబ్బంది



వాజేడులో..

వెంకటాపురం(ఎం) : పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మండలంలో బండ్లపహాడ్ గొత్తికోయగూడెంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో, కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. కార్యక్రమంలో డాక్టర్ చందన, ఏఎన్ఎంలు అనురాధ, స్వప్న, శోభ, హెచ్ఎ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వాజేడు : వానాకాలంలో వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తినాలని వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్, ప్రగళ్లపల్లి పల్లె దవాఖానా వైద్యాధికారి జ్ఞానస సూచించారు. సోమవారం మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 42 మందిని పరీక్షించారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి మందులు అందించడంతో పాటు గర్భిణులను పరీక్షించారు. ఇంటింటి సర్వే చేయడంతో పాటు నిల్వ ఉన్న నీటిని పారబోశారు. గ్రామంలో మలేరియా ఉన్న రోగి నుంచి రక్త నమూనాలు సేకరించి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల లార్వా వృద్ధి చెందకుండా నీటి కాల్వల ద్వారా పంపించాలని సూచించారు. కోటిరెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

మార్కెట్ అభివృద్ధికి బాటలు వేస్తాం..



సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణి

ములుగు రూరల్: మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకవర్గ సమన్వయంతో బాటలు వేస్తామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి అన్నారు. ఈ మేరకు సోమవారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశాన్ని కార్యదర్శి సోనియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లైసెన్స్ లేని పత్తికొనుగోలు దారులను నివారించి ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సారంగం, డైరెక్టర్లు పన్నాల ఎల్లారెడ్డి, దేవ్‌సింగ్, పాలకుర్తి సమ్మయ్య, సీతారాంనాయక్, వెంకన్న, రాజ్‌కుమార్, బాలయ్య, పగడయ్య, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల : మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో విభేదాలు లేకుండా పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని సూచించారు.

చిట్యాల : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ క్రియాశీలక కార్యకర్త కసకం తిరుపతి అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా సోమవారం తిరుపతి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి నివాళులర్పించి, పరామర్శించారు. అలాగే మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన శ్రీపతి మొండయ్య, కాసర్ల కమలమ్మ, దూత్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటస్వామి, సుల్తానిబీ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.